సాక్షి
చిత్తూరు

బుధవారం । 18 । జనవరి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	16
తిరుపతి	31	17
తిరుమల	27	13
గూడూరు	31	19
నగరి	32	18



సై అంటై సై

వెదురుకుప్పం : మండలంలోని కురివికుప్పం, బ్రాహ్మ ణపల్లెలో ఎద్దుల పరుష సై అంటే సై అన్నట్లు సాగింది. ఉరకలు తీస్తున్న కోడెగిత్తలను అదుపు చేసేందుకు యువత పోటీ పడింది. గ్రామాల్లో సందడి నెలకొంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఫేస్ యాప్ హాజరు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో జెడ్పీ పరిధిలోని అన్ని కార్యాలయాల్లో బుధవారం నుంచి ఉద్యోగులు ఫేస్ యాప్ తప్పనిసరిగా నమోదు చేయాలని సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జెడ్పీ కార్యాల యంలో సూప రింటెండెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయాలు, పంచాయతీ రాజ్, పీఐయూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీలు, ఇతర కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఫేస్ యాప్ హాజరు నమోదు చేయాలన్నారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న స్టాండింగ్ కమిటీ సమావేశానికి సంబంధించి మినిట్స్ బుక్స్ తయారు చేయాలని తెలిపారు. పలు జిల్లా శాఖల సమాచారాన్ని సంబంధిత హెచ్‌ఓడీల నుంచి తెప్పించాలని సూచించారు. సచివాలయాల నిర్మాణ పనుల వివరాల నివేదికను ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలన్నారు. బుధవారం వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని పేర్కొన్నారు.

పోటెత్తిన బోయకొండ



ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయం మంగళవారం భక్తుల రద్దీతో పోటెత్తింది. పుష్యమాసం దశమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ పరిసరాలు భక్తుల రద్దీతో సందడిగా మారాయి. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. ఉదయం 6 గంటలనుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి చర్యలు తీసుకున్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి



కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లా డుతూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన ని ర్మాణాల పురోగతి, గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా చేపట్టిన పనులను త్వరితిగతిన పూర్తి చేయాలని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజాప్రతి నిధుల ద్వారా అందిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,014 పనులకు సంబంధించి, 1972 పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు. ఇందులో 71 పనులు పూర్తి కాగా, 1388 పనులు పురోగతిలో ఉన్నాయన్నా రు. కాన్ఫరెన్స్‌లో జేసీ వెంకటేశ్వర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో ఉద్యోగ సాధన



మెటీరియల్‌ను అందజేస్తున్న డీఈఓ విజయేంద్రరావు, తదితరులు

చిత్తూరు కలెక్టరేట్ : ఆత్మవిశ్వాసమే ఉద్యోగ సాధనకు తొలిమెట్టు అని డీఈవో విజయేంద్రరావు అన్నారు. నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో విజయేంద్రరావు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి అతిథులుగా హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు మైనారిటీ యువతకు మెటీరియల్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ఉద్యోగసాధనకు ప్రయత్నించాలని పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని కూలీ కుటుంబం నుంచి వచ్చానన్నారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మన్యూనత భావానికి లోనుకాకుండా సాధిస్తాననే నమ్మకంతో చదవాలని తెలిపారు. మైనారిటీ కో ఆప్షన్ సభ్యుడు అనూ, సభ్యులు పాల్గొన్నారు.



బాబుకు 2 వేలు.. పాపకు రూ.వెయ్యి

- వారం కిందట చిత్తూరు మండలం అయ్యప్పగారిపల్లెకు చెందిన గర్భిణిని కుటుంబ సభ్యులు ప్రసవం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. మూడు రోజుల తరువాత పురిటి నొప్పులు రావడంతో ప్రసవ గదికి తరలించారు. అక్కడ క్లీనింగ్ పేరుతో రూ.200, ఆపరేషన్ తరువాత రూ.1000, స్ట్రెచ్చర్‌పై తరలించేందుకు రూ.200, బెడ్డు శుభ్రం చేసే వారికి రూ.200 ఇచ్చుకోవాలని.. భద్రతా సిబ్బంది కూడా లోపలికి పంపేందుకు రూ.100 ఇవ్వాలని డిమాండ్ చేయడంతో గర్భిణి భర్త గొడవకు దిగాడు.
- బంగారుపాళెంకు చెందిన కవిత (పేరుమార్చాం)కు 6 నెలలకు ముందు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిగింది. ఆపరేషన్ చేసి వైద్యులు ప్రసవం చేశారు. క్లీనింగ్, గర్భిణిని స్ట్రెచ్చర్‌పై తీసుకొచ్చే సిబ్బంది రూ. 500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీన్ని గర్భిణి బంధువు వీడియో తీసి బయట పెట్టింది.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది తీరుమారడం లేదు. వైద్యం కోసం వచ్చే పేదల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. ముఖ్యంగా ప్రసూతి విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. పుట్టిన బాబుకు, పాపకు ఓ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆస్పత్రి నిర్వహణకు రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. సిబ్బంది రూ.వేలల్లో జీతాలు తీసుకుంటున్నా వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. ఆస్పత్రికి రోజూ సుమారు 20 నుంచి 30 ప్రసూతి కేసులు వస్తుంటాయి. ఒక్కొక్కరి వద్ద రూ.1,000 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వసూళ్ల పర్వం
- ఎవరెవరికి ఎంత ఇవ్వాలో ముందే హెచ్చరిక
- గర్భిణుల కుటుంబ సభ్యులకు తప్పని పాట్లు
- వైద్య సేవల్లో కూడా అలసత్వం
- మామూళ్లు ఇవ్వకుంటే వేధింపులు
- పట్టించుకోని అధికారులు

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రసూతి విభాగంలో సేవల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రసవం కోసం రోజూ జిల్లా నలుమూలల నుంచి 20 నుంచి 30 కేసులు వస్తుంటాయి. తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా పేదలు ప్రసవం కోసం వస్తుంటారు. సరిపడా వైద్యాధికారులు, సిబ్బంది, అన్ని వసతులను ప్రభుత్వం కల్పించింది. ప్రసూతి కోసం వచ్చిన మహిళా బంధువుల నుంచి కొందరు ప్రసూతి విభాగం సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది, ఇతర సిబ్బంది గ్రూపులుగా మారి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముందుగా ఆస్పత్రికి వచ్చిన మహిళను ప్రసూతి విభాగంలో చేర్పిస్తారు. ఆపరేషన్‌కు సంబంధిత దుస్తులు మహిళ ధరించిన తర్వాత(క్లీనింగ్ పేరుతో)అక్కడి సిబ్బంది రూ.200 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. ఆ తర్వాత డెలివరీ అయిన వెంటనే ఆపరేషన్ థియేటర్‌లో ఉండే ఇద్దరు సిబ్బంది పుట్టిన పాపకు లెక్కకట్టి మరీ వసూలు చేస్తారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

డబ్బులివ్వకుంటే చీదరింపులు

బాబు పుడితే రూ.2 వేల నుంచి, పాప పుడితే రూ.1000కి పైగా కొందరు సిబ్బంది వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. డబ్బులు ఇచ్చేంత వరకు పుట్టిన బిడ్డను తమ చేతికివ్వకుండా చీదరించుకుంటుండడంతో విధిలేని పరిస్థితుల్లో ఇవ్వాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. దీంతోపాటు అదనంగా ప్రసూతి వార్డుకు తరలించేందుకు వార్డు బాయ్‌కి రూ.200 నుంచి రూ. 500, ప్రసూతి వార్డులో పడక చూపించిన సిబ్బందికి రూ.300 ఇలా ఎక్కడి సిబ్బంది అక్కడే దోచుకుంటున్నారని చెబుతున్నారు. మొత్తంగా సుమారు రూ.2000 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎవరికి ఎంతెంత డబ్బులు ఇవ్వాలనేది కూడా సిబ్బంది ముందుగానే చెబుతున్నారని పేర్కొంటున్నారు. తాము 7 నుంచి 10 మంది ఉంటామని, మీరిచ్చిన డబ్బులు అందరం పంచుకుంటామని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. ప్రసూతి వార్డుకు తల్లిని, బిడ్డను తరలించిన తర్వాత ఒక మహిళ సిబ్బంది వచ్చి డబ్బులు వసూలు చేసుకుని వెళ్తుంది. ఆ తర్వాత మరో మహిళ సిబ్బంది వచ్చి ఇంతకుముందు ఇచ్చిన డబ్బులు తమకు కావని వారు ఆపరేషన్ థియేటర్ సిబ్బంది అంటూ ఒకరి తర్వాత ఒకరు డబ్బుల కోసం వేధిస్తున్నారు. ఒకవేళ సిబ్బంది అడిగినంత డబ్బులు ఇవ్వకుంటే వారికి నరకం చూపుతున్నారు. కాదనీ రూ.100 ఇస్తే మొహం మీదే విసురుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

ఇక్కడ కాదు..వెళ్లిపోండి..

గతంలో జిల్లా కలెక్టర్, డీసీహెచ్ భయంతో డెలివరీ కేసులు ఒకటో..రెండో తప్ప పెద్దగా రెఫర్ కేసులు ఉండేవి కావు. వారం రోజులుగా డెలివరీ కేసులపై వైద్యాధికారులు ముఖం చాటేశారు. ఓపీ వద్దే డెలివరీ ఇక్కడ కాదనీ..వెళ్లిపోండి అంటూ గర్భిణులను సిబ్బంది తరిమేస్తున్నారు. అడ్మిషన్‌లు చేయడం లేదు. చేశామన్నట్టుగా చెప్పుకోవడానికి కొంత మందిని మాత్రమే డెలివరీ కోసం ఆస్పత్రిలోకి అడుగు పెట్టిస్తున్నారు. ఓపీ నుంచి అట్టే పంపిం చేస్తున్నారనే కొందరు అధికారుల దృష్టికి తీసుకెళుతున్నారు.

పత్తాలేని అధికారులు..

ప్రసూతి వార్డులో జరుగుతున్న అవినీతి గురించి జిల్లా అధికారులకు, ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదులు వెళుతున్నాయి. అయినా వసూళ్ల పర్వం కొనసాగుతూనే ఉంది. ప్రసూతి వార్డు ఇన్‌చార్జీ అధికారులు ఈ విషయాన్ని మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బంది డబ్బులు అడుగుతున్నారని ఎవరికైనా చెబితే ఎక్కడ మళ్లీ తమను హింసిస్తారనే భయంతో బాధితులు చాలామంది నోరు మెదపడం లేదు. జిల్లా వైద్యాధికారులు ఇకనైనా ప్రసూతి విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సి ఉంది.

కాసులడిగితే ఇలా చేయెచ్చు

ప్రభుత్వ ఆస్పత్రి ప్రసూతి విభాగంతో పాటు అన్ని విభాగాల్లో డబ్బులు డిమాండ్ చేస్తే ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. 104కు ఫోన్ చేస్తే చాలు. లేదా ఏసీబీ టోల్ ఫ్రీ నంబరు 14400కు ఫోన్ చేయవచ్చు. కానీ పక్షంలో వీడియో, ఫొటో, వాయిస్ రికార్డ్ చేసి ఏసీబీ యాప్‌లో కూడా నమోదు చేయవచ్చు. ఇలా చేస్తే 15 రోజుల్లో సమస్య పరిష్కారమయ్యేలా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారు.

దృష్టి సారిస్తాం



ప్రసూతి వార్డులో డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. గతంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ వార్డులో ఉన్న సిబ్బందిని వేరే వార్డుకు బదిలీ చేశాం. సిబ్బంది డబ్బులు అడిగితే మాకు ఫిర్యాదు చేస్తే వెంటనే తగు చర్యలు తీసుకుంటాం. ఇద్దరు గైనిక్ డాక్టర్లు లేరు.

– డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వాస్పత్రి, చిత్తూరు

నిఘా పెడతాం



డబ్బుల వసూళ్లపై నిఘా పెడుతాం. ఇద్దరు అధికారులను ప్రత్యేకంగా నియమిస్తాం. త్వరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్దేలా చర్యలు తీసుకుంటాం. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకోరావచ్చు. కచ్చితంగా నిజమని తేలితే విధుల నుంచి తప్పిస్తాం.

– నరేష్‌కుమార్‌రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, అపోలో

నిర్లక్ష్యాన్ని సహించం



ఆస్పత్రిలో ఎలాంటి సేవలకు సిబ్బందికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటాం. దీనిపై సూపరింటెండెంట్‌తో చర్చించి చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రిలో వైద్యసేవలే ముఖ్యం. నిర్లక్ష్యాన్ని సహించేది లేదు.

– బీఎస్‌కే నాయక్, డీసీహెచ్ఎస్, చిత్తూరు

రాష్ట్రంలో ప్రతిరోజూ పండగే

- సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కేరోజా
- రోజా ట్రస్టు సేవలు అభినందనీయం – అలీ
- సంప్రదాయాలకు అద్దం పట్టేలా పోటీలు – స్విమ్స్ డైరెక్టర్ వెంగమాంబ



ఎడ్ల బండిపై వస్తున్న మంత్రి ఆర్కేరోజా, అలీ

నగరి : ముఖ్యమంత్రి జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలకు ప్రతిరోజూ పండుగే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం నగరి డిగ్రీకళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయిలో రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు జరిగాయి. పోటీలకు రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీతో కలిసి ఎడ్లల బండిపై ఆమె విచ్చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. పోటీల నిర్వహణలో భాగంగా మైదానంలో చిలక జోస్యం స్టాలు వద్ద ఆలీ, స్విమ్స్ డైరెక్టర్ వెంగమాంబ జోస్యం చెప్పించుకున్నారు. ఎంపీపీ భార్గవి, సీడీపీవో కృష్ణవేణికి మంత్రి రోజా మెహందీ పెట్టారు. పొంగలి పెట్టి, డూడూ బసవన్నకు పూజలు చేశారు. సంక్రాంతి పిండి వంటలను తెలిపే ఐసీడీఎస్ బజార్‌లో మంత్రి, అతిథులు పదార్థాల రుచి చూశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రతి ఇంటికీ ఏం చేస్తే సంతోషం ఉంటుందో వలంటీర్‌ను పంపి తెలుసుకుని, ప్రతి పథకాన్ని వారి ఖాతాలకే జమ చేసి ఆదుకుంటున్నారన్నారు. నేడు ఆనందంగా సంక్రాంతిని వారు జరుపుకుంటున్నారన్నారు. నగరి కొండచుట్టుకు చాలా విశిష్టత ఉందని, అందుకే పోటీలు నిర్వహించామన్నారు. సాంస్కృతిక మంత్రిగా సంప్రదాయాలు కాపాడాలన్న తపన, అక్కచెల్లెళ్లను సంతోషపెట్టాలన్న కోరికతోనే పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలో పాల్గొన్న వారందరికీ ఆడపడుచుగా చీర, గాజులు సాంగెం పెట్టినట్లు పేర్కొన్నారు.

రోజా ట్రస్టు సేవలు అభినందనీయం

రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ మాట్లాడుతూ ముగ్గులు చూస్తుంటే కష్టపడి వేసినట్లు లేదని.. ఇష్టపడి వేసినట్లు ఉందన్నారు. బహుమతి రానివారు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. డ్రామా వేస్తే తనకు తొలుత బహుమతిగా లైఫ్‌బాయ్ సోపు వచ్చిందని తెలిపారు. అదే నేడు ఈ స్థాయికి చేర్చిందన్నారు. తోటి కళాకారులకు మంచి చేయడంలో మంత్రి రోజా ముందుంటారని తెలిపారు. ఈ రోజు ఆమె చేసిన పండగ ఏడాదంతా గుర్తుపెట్టుకునేలా ఉందన్నారు. సొంత ట్రస్టు నుంచి ఇంతటి ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు.



ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి, అతిథులు

సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం

స్విమ్స్ డైరెక్టర్ వెంగమాంబ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఈ పోటీలు ఉన్నాయని తెలిపారు. సంక్రాంతి పండుగంటే అందరికీ గుర్తొచ్చేది ముగ్గులు. అలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. తుడా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ కళలు, సంస్కృతి, సంప్రదాయాలు సంరక్షించే ప్రయత్నం ఇక్కడ జరిగిందన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు, వైఎస్సార్ సీపీనేత రాంప్రసాద్ రెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, జయప్రకాష్, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, ఎంపీపీలు భార్గవి, దీప, సీడీపీవో కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్లు, ఆర్బీకే చైర్మన్లు, ఆలయ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ముక్కోటి దేవతలు ఒక్కటైన వేళ..

నగరి పట్టణంలో కొండచుట్టు ఉత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఏక కాలంలో సకల దేవతామూర్తులు ఒక్కచోటకు చేరడంతో చూసేందుకు కాంచిన కనులదే భాగ్యం అన్నట్లు అశేష భక్తులు దర్శించి తన్మయత్వం చెందారు. ఉదయం నుంచే మండపం వద్ద హడావుడి మొదలైంది. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు కొండచుట్టు నిర్వహించడం ఆనవాయితీ. పరిసర గ్రామాల నుంచి వచ్చే దేవతలకు ఆహ్వానం పలికేందుకు ముందుగా శ్రీకరకంఠేశ్వర స్వామికి అభిషేక పూజలు, అలంకరణలు చేసి మండపం వద్దకు వేంచేపు చేశారు.

- 20 ప్రాంతాల నుంచి విచ్చేసిన దేవతామూర్తులు
- శోభాయమానంగా మండపం పరిసరాలు
- నగరిలో కొండచుట్టు కోలాహలం



నగరి కొండచుట్టు మండపం వద్ద కొలువుదీరిన దేవతామూర్తులు

నగరి : పట్టణంలో కొండచుట్టు ఉత్సవానికి భక్తజనం పోటెత్తారు. ముందుగా పట్టణంలోని శ్రీకరకంఠేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామివారు మండపం వద్దకు వేంచేపు చేశారు. స్వామి ఆహ్వానం మేరకు పాళమంగళం నుంచి పాళేశ్వరస్వామి, ముడిపల్లె అగస్త్యేశ్వర స్వామి, కరింబేడు నాథాశీశ్వర స్వామి, మేళంబాకం రాధాకృష్ణస్వామి, మిట్టపాళెం పాళేశ్వరస్వామి, దేశూరు అగరం నుంచి వేణుగోపాలస్వామి, కృష్ణారామాపురం గ్రామం నుంచి శివపార్వతులు, తెరణి వైకుంఠనాథస్వామి, సత్రవాడ నుంచి చిదంబరేశ్వరస్వామి, శివగామి సుందరి, చింతలపట్టెడ శరవణవినాయక, అగరవినాయక స్వామి, మేళపట్టు ఈశ్వరస్వామి, ఎలకాటూరు కృష్ణమూర్తి స్వామి, ముడిపల్లె అగస్త్యేశ్వర స్వామి, రాధారుక్మిణి స్వామి, చవరంబాకం పరమేశ్వరస్వామి, కళియంబాకం కాళేశ్వరస్వామి, జ్ఞానమ్మ పట్టెడ నుంచి మీనాక్షి దేవి కొండచుట్టు మండపానికి విచ్చేశారు. మొత్తం 20 ప్రాంతాల నుంచి ఊరేగింపుగా విచ్చేసిన దేవతలకు ఆయా గ్రామస్తులు దారి పొడవునా రంగవల్లికలతో ఆహ్వానించారు. కర్పూర హారతులు సమర్పించారు. కరకంఠేశ్వర స్వామి ఎదురెళ్లి ఆహ్వానం పలుకగా, మండపం వద్దకు చేరి విఘ్నేశ్వరుని దర్శించుకుని సమీప మైదానంలో దేవతామూర్తులు కొలువుదీరారు. ఆ కమనీయ దృశ్యాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏకకాలంలో దేవతామూర్తులకు హారతులు ఇవ్వడం ప్రత్యేకను సంతరించుకుంది. దేవతామూర్తులను దర్శించి అశేష భక్తజనం తరించారు.దేవతామూర్తుల తరపున అర్చకులకు కరకంఠేశ్వరస్వామి ఆలయ అర్చకులు పరివట్టం కట్టి మర్యాదలు చేసి వీడ్కోలు పలికారు.

తిరనాళ్ల సందడి

కొండచుట్టు మండపం వద్ద తిరనాళ్ల సందడి నెలకొంది. పరిసరాల్లో తినుబండారాలు, బొమ్మలు, గాజులు, బొరుగులు, చెరకు గడలు విక్రయించే దుకాణాలతో సందడిగా మారింది. సాయంత్రం 4 గంటల నుంచి కొండచుట్టుకు వెళ్లే మార్గంలో రద్దీ ఏర్పడింది. రాత్రి విద్యుద్దీప కాంతులతో మండప పరిసరాలు శోభాయమానంగా కనిపించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రవికుమా ర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

డ్రగ్స్ రహిత జిల్లానే లక్ష్యం

చిత్తూరు కలెక్టరేట్ : డ్రగ్స్ రహిత జిల్లాగా తయారు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌వో రాజశేఖర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో డీఆర్‌వో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అమ్మినా, తీసుకున్నా టోల్ ఫ్రీ నంబర్ 14500కు ఫిర్యాదు చేయవచ్చని, వివరాలను గోప్యంగా ఉమచుతారని తెలిపారు. యుక్త వయస్సులో గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోకుడ దన్నారు. జిల్లాలో ఎక్కడైనా పిల్లలు మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు తీసుకుంటున్నట్లు గుర్తిస్తే కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. మురికివాడల వద్ద నిఘాను పెంచాలని తెలిపారు. మాదకద్రవ్యాల వాడకం, దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ధూమపానానికి సంబంధించిన ఉత్పత్తులు అమ్మకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్లలో బ్యానర్లు, హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఈఎస్ ఆయిషా, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆనందరెడ్డి, డీఎల్‌డీఓ రవికుమార్, డీవైఈఓ చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్ఓ రాజశేఖర్

నేడు ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సీనియర్ ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఈనెల 18 న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సీనియర్ ఎస్‌జీటీలను స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిగా అవసరమున్న పాఠశాలల్లో నియమిస్తామన్నారు. అర్హులైన ఎస్‌జీటీల జాబితాలను డీవైఈవో, ఎంఈవోల మెయిల్‌కు పంపినట్లు తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న ఎస్‌జీటీలు సర్వీస్ రిజిస్టర్లతో బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు డీ ఈవో కార్యాలయానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఎవరికీ ఎటువంటి మినహాయింపు లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 66 మండలాల ఎంఈవోలు జాబితాలోని టీచర్లను కౌన్సెలింగ్ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈవో ఆదేశించారు.

క్లుప్తంగా

మరో 3 రోజులు రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: మరో మూడు రోజులు రేషన్ పంపిణీని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. జిల్లాలో రేషన్ పంపిణీ మంగళవారం వరకు చేపట్టగా, 88 శాతం వరకు పూర్తయింది. మిగిలిన వారు కూడా రేషన్‌ను సద్వినియోగం చేసుకునేలా పంపిణీ గడువును ఈనెల 20వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని, కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

19, 20 తేదీల్లో డీఫార్మసీ కౌన్సెలింగ్

తిరుపతి ఎడ్యుకేషన్ : డీ ఫార్మసీ కోర్సులో 2022–23లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 19, 20వ తేదీల్లో కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18,19 తేదీల్లో 'ఏపీడీపీహెచ్‌ఏఆర్‌ఎం.ఎన్‌ఐసీ.ఇన్' వెబ్ సైట్ ద్వారా ఫీజు చెల్లించాలని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ర్యాంకు కార్డు, పది, ఇంటర్ మార్కుల జాబితా, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, 2019 జనవరి ఒకటో తేదీ తరువాత తీసుకున్న ఆదాయ, కుల, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఒరిజినల్‌తో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో హాజరవ్వాలని సూచించారు. కౌన్సెలింగ్ పూర్తి చేసుకున్న వారు 19, 20, 21వ తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

20 లోపు మార్కులను అప్‌లోడ్ చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈనెల 20 లోపు సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ–1) పరీక్షల మార్కులను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని డీఈవో విజయేంద్రరావు ఆదేశించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జవాబుపత్రాలను పకడ్బందీగా మూల్యాంకనం చేయాలన్నారు. ఎక్కడైనా తప్పిదాలు జరిగితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. బోధన, బోధనేతర సిబ్బంది ప్రతి రోజు తప్పనిసరిగా ఫేషియల్ అటెండెన్స్ నమోదు చేయాలని తెలిపారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఈవో స్పష్టం చేశారు.

వేడుకగా కనుమ ఉత్సవం


గోవులకు గ్రాసం పెడుతున్న ఈఓ వెంకటేశు


విశేషాలంకరణలో సిద్ధి,బుద్ధి వినాయకస్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం గోపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో గోవు చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి గోశాలలోని గోవులకు కర్పూర హారతులతో పూజలు చేశారు. గోవులకు అధికారులు పశుగ్రాసం తినిపించారు. ఈఓ మాట్లాడుతు గో పూజ చేస్తే ముక్కోటి దేవతలకు పూజలు చేసినట్లేనని తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయం

వరుస సెలవులు, సంక్రాంతి పండుగ కావడంతో స్వామివారి దర్శనార్థం భక్తులు తరలి వచ్చారు. రూ.150, రూ.100 , ఉచిత దర్శన క్యూలైన్లు భక్తులతో నిండి పోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తగు చర్యలు తీసుకున్నారు.

చందన అలంకరణలో దర్శనం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి మంగళవారం చందన అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు ఊయలలో సేదతీరుతున్న స్వామి, అమ్మవార్లను వీక్షించి తరించారు.

28న రథసప్తమి వేడుకలు

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో, అనుబంధ శ్రీవరదరాజులస్వామి ఆలయంలో ఈనెల 28న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం అభిషేక పూజలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. రాత్రి గ్రామోత్సవం ఉంటుందని వివరించారు.


భక్తులతో నిండిన క్యూలు

2 వారాల్లో ఆడిట్ పూర్తి కావాలి


అధికారులకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని 65 ఎంపీడీఓ కార్యాలయాలకు సంబంధించి ఆడిట్ వివరాలను అందజేయాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో కార్యాలయ సూపరింటెండెంట్లు, ఆడిట్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. 2021–2022 సంవత్సరానికి సంబంధించి జెడ్పీ కార్యాలయ విభాగాలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఐయూ, ఎంపీడీఓ కార్యాలయాల పరంగా వార్షిక ఆదాయ, వ్యయ వివరాలను అందించాలన్నారు. 2 వారాల్లో ఆడిట్ పూర్తి కావాలని తెలిపారు.

డ్రగ్స్ నియంత్రణకు చర్యలు

జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జెడ్పీ కార్యాలయంలో సీఈఓతో ఎస్‌ఈబీ ఏఈఎస్ అయేషా సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో డ్రగ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సీఈఓ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, రద్దీ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై డీఈఓ, జిల్లా ఒకేషనల్ అధికారి, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమై తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

దూసుకొచ్చిన మృత్యువు

భాకరాపేట ఘాట్‌లో బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- అక్కడికక్కడే ఇద్దరు మృతి
- ఒకరి పరిస్థితి విషమం
- పండగ చేసుకుని తిరిగి వస్తూ ప్రమాదం
- నూతనకాల్వలో విషాదం


ప్రమాదంలో రోడ్డుపై పడి ఉన్న మృతదేహాలు

భాకరాపేట: మృత్యువు దూసుకొచ్చింది. ఇద్దరి యువకులను పొట్టనపెట్టుకుంది. ఒకరిని ఆస్పత్రిపాలు చేసింది. వారినే నమ్ముకున్న కుటుంబీకులకు తీరని విషాదాన్ని మిగిల్చింది. మంగళవారం మధ్యాహ్నం తిరుపతి–పీలేరు జాతీయ రహదారి, భాకరాపేట ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భాకరాపేట ఎస్‌ఐ ప్రకాష్‌కుమార్ కథనం.. భాకరాపేట ఘాట్ రోడ్డు మొదటి మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చిత్తూరు జిల్లా, రొంపిచెర్ల మండలం, రావెలవారి పల్లెకు చెందిన మురళి కుమారుడు సాయికృష్ణ (22), అతని స్నేహితుడు, తిరుపతికి చెందిన హేమంత్ (22) అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

ఇద్దరూ మంచి స్నేహితులు

సాయికృష్ణ, హేమంత్ మంచి స్నేహితులు. ఇద్దరూ తిరుపతిలో ఐటీఐ చేస్తూ.. ఖాళీ సమయంలో పార్ట్ టైమ్‌గా నీటి శుద్ధి కేంద్రంలో పనిచేస్తున్నారు. అన్నమయ్య జిల్లా, కేవీపల్లె మండలం, నూతనకాల్వలోని సాయికృష్ణ అమ్మమ్మ ఇంటికి సంక్రాంతి పండగకని వెళ్లారు. సోమవారం బంధువులతో కలిసి పండగ చేసుకున్నారు. మంగళవారం ఉదయం తిరుపతికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు.

స్వామి మొక్కు తీర్చుకోవాలని..

సాయికృష్ణ మేనమామ కొడుకు శివ(24) హైదారాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు వచ్చిన శివ తమతోపాటు తిరుపతికి వచ్చి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని అటు నుంచే హైదారాబాద్‌కు వెళతాడని చెప్పడంతో ముగ్గురూ కలిసి ద్విచక్రవాహనంలో తిరుపతికి బయలుదేరారు. భాకరాపేట ఘాట్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సాయికృష్ణ, హేమంత్ అక్కడికక్కడే మృతిచెందారు. బస్సు చక్రాలు వారి తలలపై వెళ్లడంతో పరిసరాలు రక్తసిక్తమయ్యాయి. వెనుక కూర్చుని ఉన్న శివకు తీవ్ర గాయాలయ్యాయి.

క్షతగాత్రుడిని 108 సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. బంధువుల ఆర్తనాదాలతో భాకరాపేట పోలీస్‌స్టేషన్ దద్దరిల్లింది. కేసు దర్యాప్తులో ఉంది.

పురాతన రాతి విగ్రహాలు లభ్యం



పుంగనూరు మండలం బోడినాయునిపల్లెలో లభ్యమైన శిలలు

పుంగనూరు: మండలంలోని బోడినాయునిపల్లెలో వసంతకుమార్ పొలంలో మంగళవారం పనులు చేస్తుండగా 12 పురాతన రాతి విగ్రహాలు లభ్యమయ్యాయి. రాళ్లపై వివిధ దేవతామూర్తుల చిత్రాలను చెక్కి ఉన్నారు. దీనిపై వసంతకుమార్ పురావస్తు శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి పరిశీలించి ఏ కాలం నాటివో తెలియజేయాల్సి ఉంది.



హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో విభజనకు అవకాశం

చిత్తూరు రూరల్: హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో కుటుంబ విభజన కోసం మంగళవారం నుంచి ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. చాలా మంది రేషన్ కార్డుదారులు హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో వేరు చేసుకోలేక పోతున్నారని పేర్కొ న్నారు. వేరు చేసుకోవడానికి కొన్ని నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. వివాహమైన వారు కచ్చితంగా మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. డిజిటల్ అసిస్టెంట్ స్ప్లిట్ చేసిన తరువాత వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్.. అక్కడి నుంచి పంచాయతీ కార్యదర్శి.. ఎంపీడీఓ లాగిన్‌లో అనుమతి రావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

20న పోలీసు పోస్టులకు మోడల్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మిట్టూరులో ఉన్న కుట్టి కోచింగ్ కేంద్రంలో ఈ నెల 20న ఎస్‌ఐ, కానిస్టేబుల్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఉచిత మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పవనకుమారి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాసే అభ్యర్థులు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9491844963 నంబర్‌ను సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడు హర్షవర్ధన్

తవణంపల్లె: మండలంలోని మత్యం రోడ్డులో బొలెరో వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంలో వెళుతున్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ ప్రసాద్ కథనం మేరకు ..మండలంలోని నీలంపల్లె దళితవాడకు చెందిన మనోహర్ కుమారుడు హర్షవర్ధ న్(22) అమరరాజ ఫ్యాక్టరీలో పనిచే స్తున్నాడు. డ్యూటీ ముగించుకుని టీవీఎస్ ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్నాడు. మత్యం రోడ్డులో ఎగువ వెంకటాపురం సమీపంలో తవణంపల్లె వైపు వస్తున్న కొబ్బరి కాయల లోడ్ బొలెరో వాహనం అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో హర్షవర్ధన్‌కు తలకు బలమైన గాయాలు తగలడంతో అరగొండ అపోలో హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి పెదనాన్న కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: తిరుపతి–రేణిగుంట మార్గం మధ్యలో కాటన్ మిల్ సమీపంలో రైలు కిందపడి మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలమేరకు.. సుమారు 80 సంవత్సరాల గల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని వివరాలు తెలియలేదు. దీనిపై కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడు ఆచూకీ తెలిస్తే 9966182180 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

4 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సీఐ, పోలీసులు

గుడుపల్లె: మండలంలోని గణేష్ పురం క్రాస్ వద్ద 4 కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశా రు. కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్ కథనం మేరకు.. మంగళవారం సాయంత్రం కుప్పం–పలమనేరు జాతీయ రహదారి గణేష్‌పురం క్రాస్ వద్ద వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఈసమయంలో పోలీసులను చూసి గోనె సంచితో ఇద్దరు పరుగులు తీశారు. పోలీసులు వెంబడించి వారిని పట్టుకున్నారు. గోనె సంచిని తనిఖీ చేయగా రూ.32 వేలు విలువ చేసే 4 కిలోల గంజాయి ఉంది. దీన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో కుప్పం మండలం మలకలదొడ్డి పంచాయతీకి చెందిన కొనైకుంట గ్రామానికి చెందిన సత్యవేలు, గోపిగా తేలింది. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈదాడిలో పోలీసు ఐడీ పార్టీ సిబ్బంది రత్నం, నటరాజు, అరుణాచలం పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

శ్రీకాళహస్తి: హత్యకేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో భార్య ఉమామహేశ్వరిని సోమవారం ఇంటి వద్ద కర్రతో కొట్టడంతో ఆమె మృతి చెందిన విషయం తెల్సిందే. అక్కడి నుంచి పరారైన భర్త చెంగయ్యను మంగళవారం రాత్రి 1వ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం.

టీడీపీ నేత కుటుంబానికి రూ.62,426 లబ్ధి


మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్యంకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

- వైఎస్సార్ ఆసరా కింద రూ.23,926
- రైతు భరోసా కింద రూ.38,500
- పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు
- టీడీపీ నాయకుడి ఇంటికెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించిన ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్: పార్టీలు, కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అందిస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. నాయుడుపేటకు చెందిన ఓ టీడీపీ నాయకుడి కుటుంబానికి చేకూరిన లబ్ధి ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఎమ్మెల్యే సంజీవయ్య మంగళవారం నాయుడుపేట పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రహారంపేటలో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం ఇంటికి ఎమ్మెల్యే సంజీవయ్య వెళ్లారు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిన బుక్‌లెట్‌ను అందజేశారు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి వైఎస్సార్ ఆసరా కింద రూ.23,926లు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.38,500 మొత్తం రూ.62,426 లబ్ధి పొందినట్లు అందులో నమోదై ఉంది. ఎమ్మెల్యేతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, ఇతర నాయకులను సుబ్రహ్మణ్యం ఇంట్లోకి సాదరంగా ఆహ్వానించారు. కుటుంబ సభ్యులను వారికి పరిచయం చేశారు.

తలకోనలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

ప్రముఖ పర్యాటక కేంద్రం, ప్రకృతి సోయగాలకు నిలయం, సకల జీవ రాసులకు ఆలవాలమైన తలకోనకు ప్లాస్టిక్ మహమ్మారి సవాల్ విసురుతోంది. నిషేధిత ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన అధికారులు చేతులెత్తేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ క్రమంలో తలకోన మొత్తం ప్లాస్టిక్ మయమైంది. అడిగేవారు లేకపోవడంతో పర్యాటకులు విచ్చలవిడిగా వినియోగించడం రివాజుగా మారుతోంది.

- ఎర్రావారిపాళెం

మృత్యువాత పడుతున్న మూగజీవాలు

తలకోన పరిసరప్రాంతాల్లో ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు, కవర్లు, బాటిళ్లు, సిల్వర్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. పార్సిల్ కవర్లు ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారు. వీటికి చుట్టిన దారాలు కాళ్లకు తగులుకుని పక్షులు ఎగరలేక మృత్యువాత పడుతున్నాయని జంతు ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. మద్యం బాటిళ్లను సైతం బండలు, చెట్లు, రోడ్లపై పగలగొట్టడంతో పర్యాటకులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాల్సి ఉంది.




తలకోన పరిసర ప్రాంతాల్లో నిండిపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు